# కర్నూలు జిల్లాలో కిరాయి హంతకుల ఎన్‌కౌంటర్లు

(లేక సీతామాంజనేయుల వారి
కిరాయి హంతక సంహారం అను వీరగాధ)

యు. జి. శ్రీనివాసులు

మానవహక్కుల కార్యకర్త, కర్నూలు

**వాళ్లందరూ కిరాయి హంతుకులూ కాదు, వాటిలో ఏ ఒక్కటీ ఎన్‌కౌంటరూ కాదు. నక్సలైట్లకు రాజకీయ సానుభూతి ఉంటుంది. కాబట్టి వారిని చంపేటప్పుడు పోలీసులు కొంచెం జాగ్రత్తయినా తీసుకున్నారేమో. అది నిజమైన ఎన్‌కౌంటర్ అని నమ్మగల పరిస్థితి కల్పించడానికి ఒకనాడైనా కొంచెం ప్రయత్నం చేశారేమో. వీళ్లు 'దొంగలు'. వీరికి ఏ సానుభూతీ ఉండదన్న భరోసాతో మరీ విచ్చలవిడిగా ప్రవర్తించారు.**

ఒకరి విషయంలో మొదలయిన అన్యాయం వారిదగ్గరే ఆగిపోదనీ తమ దాకా వచ్చేదాకా కళ్లు మూసుకొని ఉండకుండా సకాలంలో అందరూ స్పందించాలనీ హక్కుల సంఘాలు మొదటి నుండీ అంటున్నాయి. ఆగిపోకుండా ఉండడానికి కారణాలు చాలా ఉన్నాయిగానీ ఎన్‌కౌంటర్ల విషయంలో ఒక ముఖ్యమైన కారణమేమిటంటే చంపే అధికారం రుచి మరిగిన పోలీస్ అధికార్లు వేరే జిల్లాలకు బదిలీ అయినప్పుడు అక్కడ నక్సలైట్లు దొరకకపోతే వేరే 'అసాంఘిక శక్తుల' పైన దానిని ప్రయోగించకుండా ఉండరు. 'అసాంఘిక శక్తుల' నిర్వచనం విస్తరించే కొద్దీ కొత్త కొత్త వర్గాలకు ఈ ప్రమాదం విస్తరిస్తుంది.

కర్నూలు పోలీస్ సూపరింటెండెంట్ గా ఉన్న గౌరవనీయులు సీతారామాంజనేయులుగారు అంతకుముందు కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలో ఎఎస్‌పి పనిచేశారు. ఆ తరువాత వరంగల్‌లో ప్రత్యేక అడిషనల్ ఎస్‌పిగా పనిచేశారు. అరెస్టు, నేరపరిశోధన, విచారణ, అప్పీలు, స్పెషల్ లీవ్ పిటిషన్లు ఈ తంతంతా చట్టం కల్పించిన అనవసరమైన చాదస్తమనీ- పట్టుకున్న వెంటనే కాల్చిపారేస్తే శ్రమ, ఖర్చు, ముద్దాయి తప్పించుకునే రిస్కు ఉండవనీ ఆనాడే ఒక నిర్ణయానికి వచ్చారు.

వాళ్లకే వదిలేస్తే ఈ కోవకు చెందిన పోలీస్ అధికారులు అందరికీ ఇదే సూత్రాన్ని అమలు చేస్తారు. స్థాయిని బట్టి ఒకరిని చంపొచ్చు. ఒకరి కాళ్లు విరగ్గొట్టవచ్చు, ఒకరికి గుండు గీసి పంపించవచ్చు, ఒకరిని బట్టలు విప్పి ఊరేగించవచ్చు. మొత్తానికి తామే శిక్ష వేసేస్తారు.

## ఫ్లోటింగ్ నేరస్తులపై మొదటి వేటు

అయితే అందరికీ ఈ సూత్రాన్ని అమలు చేయగల స్థితి ఇప్పటికింకా లేదు. నక్సలైట్ల విషయంలో అమలు చేసేయొచ్చు. అది ముప్పయి ఏళ్లుగా ప్రభుత్వ విధానంగా ఉంది. సమాజంలోనూ దాని పట్ల పెద్దగా వ్యతిరేకత లేదు. కానీ కర్నూలులో ఎవరి మీద దానిని అమలు చేయాలి? ఫ్యాక్షనిస్టులను సమూలంగా అణచివేస్తానని సీతారామాంజనేయులు ప్రకటిస్తున్నారు. ఆ ప్రకటనలో నిజాయితీ ఉందనే నమ్ముదాం. అయినప్పటికీ కోట్ల విజయభాస్కరరెడ్డినీ, కె.ఇ.కృష్ణమూర్తినీ, బైరెడ్డి రాజశేఖరరెడ్డినీ, భూమా నాగిరెడ్డినీ, కాటసాని రాంభూపాలరెడ్డినీ పట్టుకొని కాల్చి చంపలేదు కదా. వాళ్లకు మరీ సన్నిహితంగా ఉన్న చిన్నవాళ్లను కూడా చంపలేదు. అయినప్పటికీ చంపగలవాళ్లను చంపి ఫాక్షనిస్టులను కాకపోతే ఫాక్షనిజాన్ని సమర్థించే ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలని ఆయన నిర్ణయించుకున్నాడు. ఎనిమిదిమంది అనామకులను చంపి సభ్యసమాజం చేత భేష్ అనిపించుకున్న తరువాత చేయిజారి (ట్రిగ్గర్ అనాలేమో) కర్నూలు జిల్లాకే 'పెద్దాయన' అయిన కోట్ల విజయభాస్కరరెడ్డి అనుచరులిద్దరిని చంపి గొడవ మీదికి తెచ్చుకున్నాడు గానీ లేకపోతే వారి 'కిరాయి హంతక సంహారం' ఇంకెంత దూరం సాగేదో. ఇప్పటికయినా అది తాత్కాలికంగా ఆగిందే తప్ప ఆగిపోయిందనుకోవడానికి ఆస్కారం లేదు.

గొడవ జరగకుండా చంపాలంటే ఎవరిని చంపాలి? అచంచలంగా ఒక ఫాక్షన్ ముఠాకే విశ్వాసపాత్రుడిగా ఉండిపోకుండ, ఎవరు రమ్మంటే వారి దగ్గరికి పోయి వారి తరపున హింస చేసే అనిశ్చిత నేరస్తులను చంపొచ్చు. వారి తరపున ఎవరూ మాట్లాడరు. నిన్నటిదాకా ఒక నాయకుడికి సన్నిహితంగా ఉండి, ఆ తరువాత నా మీద వీడు కుట్ర చేస్తున్నాడని ఆ నాయకునికే సందేహం వచ్చేటట్టు ప్రవర్తిస్తున్న వ్యక్తులను చంపొచ్చు. అప్పుడూ ఎవరూ మాట్లాడరు. అధికార తెలుగుదేశం నాయకుల 'హిట్ లిస్టు'లో ఉన్నవాళ్లను చంపొచ్చు. అప్పుడొకవేళ కాంగ్రెస్ నాయకులు గొడవ చేసినా ఎస్‌పి కుర్చీకేమీ ఆపద రాదు. 'నకిలీ నక్సలైట్లు' 'బందిపోట్లు' తదితర రాజకీయేతర వ్యక్తులను చంపొచ్చు. వాళ్లపట్ల సమాజంలో సానుభూతి ఉండదు కాబట్టి ఫరవాలేదు.

విజయభాస్కరరెడ్డి మనుషులను చంపేదాకా కర్నూలు ఎస్‌పి సీతారామాంజనేయులు ఈ కోవకు చెందిన వారినే ఎంచుకున్నాడు. ఆ హత్యల వివరాలు చూస్తే ఈ విషయం స్పష్టంగానే అర్థమవుతుంది.

## ఒక్కొక్కరిదీ ఒక సినిమా కథ

వెలుగోడు మండలం అబ్దుల్లా పురానికి చెందిన నల్లబోతుల సుంకన్నను 2000 సంవత్సరం జులై

7న మహానంది మండలం గాజులపల్లి దగ్గర పోలీసులు ఎన్‌కౌంటర్ పేరిట చంపారు. (రెడ్లు, బ్రాహ్మలు తప్ప తక్కిన అన్ని కులాల వారినీ ఇంటిపేరు వేరే ఉన్నా కులంపేరే ఇంటిపేరు చేసి పిలవడం రాయలసీమలోని సాంఘిక దురాచారాలలో ఒకటి. పత్రికలు ఇతన్ని ఎరుకల సుంకన్న అన్నాయి). అతనిని 'నకిలీ నక్సలైటు' అని పోలీసులు అన్నారు. ఒక నక్సలైటు పార్టీ సభ్యుడు కాని వ్యక్తి ఆ పార్టీ పేరు చెప్పుకొని వ్యవహరిస్తున్నట్టయితే అతనివి 'నకిలీ' అనడంలో అర్థం ఉంది. సుంకన్న ఏ పార్టీ సభ్యుడినని చెప్పుకోలేదు. ఒక దళం పెట్టుకొని ఆళ్లగడ్డ తాలూకాలో తిరుగుతుండేవాడు. తన ఆయుధాల భయం చూపించి కొన్ని మంచి పనులు చేశాడు. కొన్ని తప్పుడు పనులు చేశాడు. కొంత డబ్బు వసూలు చేశాడు, తిన్నాడు, తాగాడు. అతనిని నకిలీ నక్సలైటు అని పోలీసులు అనడంలో గల ఉద్దేశ్యం నక్సలిజానికి అపచారం చేశాడని కాదు. ఎవరూ అతని గురించి మాట్లాడనక్కరలేదని.

సుంకన్నది నిజానికి విచిత్రమైన చరిత్ర. అతని తల్లిని గ్రామంలోని రెడ్లు కొందరు అతని చిన్నతనంలో అవమానపరిచారు. శెనక్కాయల చేనులో మొక్కలు దొంగిలించిందని ఆమెకు గుండు గీయించి పంపించారు. ఈ ఘటన సుంకన్నను 'రెబెల్'గా మార్చిందని పత్రికలు చేసిన వ్యాఖ్యలను అతని గ్రామంతో పరిచయం ఉన్నవారు సమర్థిస్తున్నారు. అతను కొంత కాలానికి నల్లమల అడవులలో ఒక నాటు తుపాకీ (బర్మార్) పట్టుకొని తిరగసాగాడు. ఇద్దరమ్మాయిలను పెళ్లి చేసుకున్నాడు. అదే అడవుల్లో ఉన్న పీపుల్స్‌వార్ దళం దగ్గరికొకరోజు తన యిద్దరు భార్యలతోనూ బర్మార్‌తోనూ పోయి ఆ పార్టీలో తనను చేర్చుకోవాలనీ అబ్దుల్లాపురం రెడ్లను శిక్షించేది ఉందనీ చెప్పినట్టు ఉన్నాడు. వాళ్లు ఆ విధంగా చేర్చుకునేది లేదనీ, తమ పార్టీలో పని చేసే ఉద్దేశ్యం ఉంటే గ్రామస్థాయి నుండి పని చేసుకుంటూ రావాలనీ చెప్పి అతని తుపాకీ విరిచి పంపించి వేశారట.

సుంకన్న నిరాశ చెందకుండా, ఏ నక్సలైట్ దళాలూ లేని ఆళ్లగడ్డ తాలూకాకు పోయి అక్కడొక దళం పెట్టుకుని పనిచేయసాగాడు. ప్రజల కోరిక మేరకు అధికారులనూ ప్రభుత్వ శాఖల సిబ్బందినీ బెదిరించడం, తగవులు పరిష్కరించడం చేస్తూ రెడ్ల దగ్గర (ముఖ్యంగా తన తల్లిని అవమానపరిచిన తన ఊరి రెడ్ల దగ్గర) పెద్ద మొత్తాలే బెదిరించి వసూలు చేస్తూ కొన్ని సంవత్సరాలు బతికాడు. సగటు రాయలసీమ ఎంఎల్ఏ కంటె భిన్నంగా బతికాడనిగానీ వారికంటే పెద్ద నేరస్తుడనిగానీ అనలేము.

సుంకన్న దళం మీద పోలీసులు అనేక పర్యాయాలు దాడులు చేశారు. అతని భార్యలలో ఒకరైన వెంకటసుబ్బమ్మను పట్టుకొని అయిదు కేసులు పెట్టి జైలుకు పంపించారు. అతనిని అతని చావుకు వారం రోజుల ముందు బండి ఆత్మకూర్ మండలం సింగారం గ్రామంలో అతని అక్క సుంకమ్మ ఇంటిలో పట్టుకున్నారనీ, 22 జూలైనాడు గాజులపల్లి దగ్గర చంపారనీ వెంకటసుబ్బమ్మ కథనం.

ఊహాత్మకమైన తిరుగుబాటుదార్ల కథలతో సినిమాలు తీసే వాళ్లు సుంకన్న కథను వాస్తవికంగా చిత్రీకరిస్తే ఒక బాధాకారమైన- అన్ని రకాలుగానూ బాధాకరమైన- సామాజిక వాస్తవాన్ని తెలియ జెప్పిన వారవుతారేమో.

## కానిస్టేబుల్ నుంచి కిరాయి హంతకుడి దాకా...

కోవెలకుంట్లకు చెందిన కాకి రామలింగప్రసాద్ ('ఎరుకల రామలింగప్రసాద్') కథ కూడా ఈ కోవకు చెందినదే. పోలీసు కానిస్టేబుల్గా ఉండి 'కిరాయి హంతకుడిగా' మారిన ఇతను చివరికి పోలీసుల చేతిలో ఎన్‌కౌంటర్‌లో హతమైన వైనం సంచలనాత్మకం అంటూ పత్రికలు రాశాయిగానీ అతని అన్నను రెడ్లు చంపడం ఈ కథకు నాంది అన్న విషయంగానీ, అతను కాటసాని రాంభూపాల

రెడ్డి, చల్లారామకృష్ణారెడ్డి వంటి కాంగ్రెస్ నాయకులతో కలిసి లెక్కలేనన్ని ఫోటోలు దిగిన విషయం గానీ అతను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌టి సెల్ కన్వీనర్ అన్న విషయంగానీ వార్తలలో అదే ప్రాముఖ్యానికి నోచుకోలేదు.

రామలింగప్రసాద్ 1991లో ఎ.ఆర్.కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరాడు. అతని అన్న రామ చంద్రుడు కోవెలకుంట్లలో చదువుకుంటుండగా రెడ్డికులానికి చెందిన విద్యార్థులతో గొడవ పెట్టుకున్నాడు. రెడ్లతో గొడవెందుకని వాళ్ల తలిదండ్రులతనిని కర్నూలుకు పంపించి మల్టీపర్పస్ ట్రైనింగ్ కాలేజీలో చేర్పించారు. అక్కడ ఉంటే కోవెలకుంట్ల గొడవలకు దూరంగా ఉంటాడని వారి ఆశ. అయితే కోవెలకుంట్ల రెడ్లు అతనిని కర్నూలులోనే హత్య చేశారు. ఇది జరిగింది 1993లో.

1997లో ఈ కేసును కర్నూలు జిల్లా కోర్టు కొట్టేసింది. ఈ అన్యాయానికి కడుపుమండిన రామలింగప్రసాద్, కేసులో ప్రధాన ముద్దాయి అయిన పరమేశ్వరరెడ్డిని హతమార్చాడు. ఆ కేసులో అతనికి శిక్షపడలేదుగానీ ఉద్యోగం పోయింది. రెడ్లతో అతనికి 'ఫాక్షన్ పడింది' కాబట్టి ఖర్చుల కోసం సారాయి వ్యాపారం పెట్టుకున్నాడు. దొంగసారాయి వ్యాపారం కూడా పెట్టుకున్నాడు.

పోలీసు కానిస్టేబుల్ ఈ విధంగా క్రమంగా 'క్రిమినల్' అయ్యాడు. వ్యాపారదక్షత కలవాడు కాబట్టి కొంత సంపాదించుకున్నాడు. కర్నూలు జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఎస్‌టిసెల్ కన్వీనర్ అయ్యాడు. కోవెలకుంట్లలో కేబుల్‌టీవిని మౌలాలి అనే ముస్లిం వ్యాపారస్తుడితో కలిసి ప్రారంభించాడు. ప్రస్తుత కోవెలకుంట్ల ఎంఎల్‌ఏ పార్థసారధిరెడ్డి ఆ మౌలాలిని బెదిరించి రామలింగప్రసాద్ వాటా తాను కొనేసుకున్నాడు. దీనితో ఆగ్రహించిన ప్రసాద్ ఆ కేబుల్ నెట్‌వర్క్ సరంజామా మొత్తం తగలబెట్టాడు. పార్థసారధిరెడ్డితో అతను ప్రత్యక్షంగా ఘర్షణ పెట్టుకున్న తర్వాతే పాణ్యం ఎంఎల్‌ఏ కాటసాని రాంభూపాలరెడ్డి ప్రసాద్‌ను మరింత చేరదీసినట్టున్నాడు. ఈ యిద్దరు రెడ్ల కుటుంబాలు కోవెలకుంట్ల తాలూకాలోని ప్రముఖ ఫాక్షన్ కుటుంబాలు.

వారి ఆధిపత్య పోరులో భాగంగా పార్థసారధిరెడ్డి తండ్రి సత్యంరెడ్డిని రాంభూపాల్‌రెడ్డి చంపిం చాడు. రామలింగప్రసాద్ ద్వారానే ఆ హత్య జరిగిందని పార్థసారధిరెడ్డి అనుమానం. తండ్రి తరువాత తన వంతు రాగలదని అతను భయపడ్డాడు. ప్రసాద్ బతికి ఉండకూడదని నిర్ణయించుకున్నాడు.

ఇక్కడి వరకు ఇది సగటు రాయలసీమ ముఠా కొట్లాటల కథే. పార్థసారధిరెడ్డి చేతిలో రామలింగప్రసాద్ చావడమో లేక రామలింగప్రసాద్ చేతిలో పార్థసారధిరెడ్డి చావడమో లేక మధ్యాంత రంగా ఇంకొక రెండు మూడు హత్యలు జరగడమో తరువాతి ఘట్టం అయి వుండేది. కానీ ఎస్పీ సీతారామాంజనేయులు స్క్రిప్ట్ మార్చాడు. పార్థసారధిరెడ్డి తెలుగుదేశం నాయకుడు. కులానికి రెడ్డి. రామలింగప్రసాద్ కాంగ్రెస్ మనిషి. కులానికి ఎరుకల. కాబట్టి పార్థసారధిరెడ్డి చేతికి మట్టి అంటకుండా పోలీసులే రామలింగప్రసాద్‌ను కాల్చి చంపారు. కేబుల్ టీవి వ్యాపారాన్ని పార్థసారధిరెడ్డి దౌర్జన్యం వల్ల పోగొట్టుకున్న రామలింగప్రసాద్, విష్ణుగ్యాస్ కంపెనీ ఏజెన్సీ తెచ్చుకుందామని హైదరాబాద్‌కు పోగా, అతనిని పోలీసులు 2000 సంవత్సరం జూలై 14 సాయంత్రం 5 గంటలకు న్యూ ఎంఎల్‌ఏ క్వార్టర్స్ దగ్గర పట్టుకొని తీసుకుపోయి 15వ తేదీ పొద్దున్న బనగానపల్లి సమీపంలో కాల్చి చంపారు.

రామలింగ ప్రసాద్‌ను మేము కేవలం రెడ్ల దౌర్జన్యానికి బలయిన నిస్సహాయుడైన ఆదివాసీగా చూపించామనీ ఇది న్యాయం కాదనీ అనేవాళ్లుంటారు. అతను తన ఆర్థిక ప్రయోజనాల కోసం, తన భద్రత కోసం పలు హత్యలు చేశాడని, దౌర్జన్యాలకు పాల్పడ్డాడనీ అంటారు. కావచ్చు. సామాజిక

సమస్యలను తెలుపు నలుపులలో చూడవలసిన అవసరంగానీ చూపవలసిన అవసరంగానీ లేదు. అయితే అతను రాంభూపాలరెడ్డి కన్నా, సత్యంరెడ్డి కన్నా, చల్లా రామకృష్ణారెడ్డి కన్నా ఎక్కువ దౌర్జన్యాలు చేశాడని ఎవరూ అనలేరనుకుంటాము.

అటువైపు, కేవలం పార్థసారథి రెడ్డి ప్రాణభయం వల్ల రామలింగప్రసాద్ చావలేదనీ దశాబ్దాలుగా రెడ్ల దౌర్జన్యపూరితమైన పెత్తనానికి కేంద్రంగా ఉన్న కోవెలకుంట్లలో ఆర్థికంగా, రాజకీయంగా పైకి వస్తున్న ప్రతిభావంతుడైన ఆదివాసీ కాబట్టి అతనిని చంపారనీ అనేవాళ్లుంటారు. ఇది కూడా నిజమే కావచ్చు. అప్పుడు ఎస్పి సీతారామాంజనేయుల శాంతి భద్రతల వ్యూహం సామాజిక స్వభావం ఏమిటో స్పష్టమే.

ఇంక మూడవ కథకు పోదాం. వలుగుమాను శ్రీనివాసులు (పత్రికల భాషలో ఎరుకల శీను) నందికొట్కూరు వాస్తవ్యుడు. రాష్ట్రంలోని మెజారిటీ ఎరుకల వారిలాగా పందులు పోషించుకుంటూ బతికేవాడు. ఇతనికి డోన్‌కు చెందిన నజీర్ అనే మిత్రుడు ఉండేవాడు. కె.ఇ. కృష్ణమూర్తి కుటుంబానికి వ్యతిరేకంగా ఈడిగ (గౌడ) కులస్తులను తన వైపు తిప్పుకోవడంలో కొంతమేరకు కృతకృత్యుడయిన రవికుమార్ అనుచరగణంలో వీరిద్దరూ ఉండేవారు. కొంత కాలానికి ఏకారణంగానో వీళ్లు రవికుమార్‌కు దూరం అయ్యారు. కెఇ వర్గంలో చేరి తనకు ఆటంకంగా తయారవుతారని (లేక తయారయ్యారనో) రవికుమార్ భయపడ్డాడేమోగానీ, నజీర్‌తో కలిసి ఉంటున్న ఒక స్త్రీ చేత వీరిద్దరినీ చంపించే వ్యూహం వేశాడంటారు. ఏమయితేనేం, ఆమె మీద ఆ అనుమానంతో శ్రీనివాసులు, నజీర్‌లు ఆమెను చంపారు.

తరువాత వీళ్లిద్దరికీ తేడాలు వచ్చాయి. నజీర్ హతమయ్యాడు. ఆ కేసులో శ్రీనివాసులు ముద్దాయి అయ్యాడు. నజీర్ పూర్తిగా కె.ఇ వర్గం, శ్రీనివాసులు పూర్తిగా రవికుమార్ వర్గం అయి వుంటే ఇద్దరూ అంత సులభంగా చచ్చేవారు కారేమో. కె.ఇ. ప్రభాకర్ రాష్ట్రమంత్రివర్గంలో ముఖ్యపదవిలో ఉన్నాడు. అటు రవికుమార్ కూడా చిన్నవాడేం కాదు. తన వాళ్లను కాపాడుకోగలడు. కానీ వాళ్లు ఏ ముఠాలోనూ పూర్తిగా భాగం కాకుండా 'ఫ్లోటింగ్' నేరస్తులుగా ఉండిపోయారు. ఎస్పి సీతారామాంజనేయులు వ్యూహానికి ఇటువంటి వారే ఎర అయ్యారని మొదట్లోనే చెప్పుకున్నాం. వీళ్లను చంపితే ఎవ్వడూ అడగడు కదా. ఏదో ఒక దశలో ఈ వర్గమూ ఆ వర్గమూ కూడా వీళ్లను వాడుకొని ఉండవచ్చును. అయినప్పటికీ వీళ్ల చావును తమ ప్రతిష్టకు సంబంధించిన సమస్యగా ఎవరూ అనుకోరు.

మే నెల 16వ తేదీన ఒక కేసు వాయిదా కోసం డోన్‌కు పోయిన శ్రీనివాసులును పోలీసులు ఆ ఊరిలోనే పొద్దున్న 8.30 లేక 9.00 గంటలకు పట్టుకున్నారు. ఇతనితో బాటున్న జనార్ధన రెడ్డి అనే వ్యక్తిని కూడా తీసుకుపోయారు. శ్రీనివాసులును అదే రోజు కాల్చి చంపి, జనార్ధన రెడ్డిని ఒకటిన్నర నెల నిర్బంధించాక నిడిచిపెట్టారు.

## బైరెడ్డి కోసం ముగ్గురు బోయల ఎన్‌కౌంటర్

బహుశా ఈ హత్యలన్నిటిలోకీ ఎక్కువ సంచలనం సృష్టించింది జైలు నుండి కోర్టుకు వాయిదాకని తీసుకుపోతూ దారిలో కాల్చి చంపిన పిక్కిలిబాబు, వెంకటరమణ, వెంకటేశ్వర్లుల హత్య. వాళ్లను తీసుకుపోతున్నది కర్నూలు జైలు నుండి అలంపురం కోర్టుకు. మొత్తం ప్రయాణం నలభై ఐదు నిముషాలుంటే ఎక్కువ. ఆ మాత్రం ప్రయాణంలోనే వాళ్లు మలవిసర్జనకో మూత్ర విసర్జనకో పోలీసులను అనుమతి అడిగారనీ వీళ్లు ఉదారంగా ఇచ్చారనీ ఆ అవకాశాన్ని ఆసరా

చేసుకొని వాళ్లు పోలీసుల చేతిలోని తుపాకీ గుంజుకొని పారిపోబోగా 'ఎన్‌కౌంటర్' జరిగి ముగ్గురూ చనిపోయారనీ పోలీసుల కథనం.

ఈ ముగ్గురూ బోయ కులస్తులు. వీళ్లంటేనే ఉండే భయానికి మూలం పూడూరు గ్రామంలో ఒక పక్క బోయకులస్తులకూ మరొకపక్క గొల్ల, మాదిగ కులస్తులకూ ఉన్న ఫాక్షన్. ఆ ఊరిలో ఇటు అయిదు అటు అయిదు మొత్తం పది హత్యలు జరిగాయని నిర్మొగమాటంగానే చెప్తారు. అటువంటి గ్రామాలకు చెందిన వారంటేనే ఆ పరిసర గ్రామాలలో భయం ఉంటుంది. అందువల్ల వారిని చేరదీసి వెంట తిప్పుకోవడం రాజకీయనాయకులకు ప్రయోజనకరం.. వాళ్లకు కూడా కేసులు, కోర్టులు, రాజీల విషయంలో రాజకీయనాయకుల అవసరం ఉంటుంది.

పూడూరు బోయలు బైరెడ్డి రాజశేఖరరెడ్డి దగ్గరికీ వైరి వర్గంవారు గౌర వెంకటరెడ్డి దగ్గరికీ సహాయం కోసం పోయేవారు. వాళ్లు కూడా ఎన్నికలప్పుడు, ఇతర రాజకీయ పర్వదినాలప్పుడు వీరిని వెంట తిప్పుకునేవారు. ముఖ్యంగా, చనిపోయిన ముగ్గురిలోకీ చాలా 'క్రూరుడు' అని పేరున్న పిక్కిలి బాబు ఎన్నికలప్పుడు బైరెడ్డి రాజశేఖరరెడ్డి గుంపులో తప్పక కనిపించేవాడంటారు. అతను పూడూరులో కాక తన భార్య ఊరయిన వీపనగండ్ల (మిడ్తూరు మండలం)లో ఉండేవాడు. ఎన్నికలప్పుడు ప్రతిరోజూ నందికొట్కూరు నుండి బైరెడ్డి అతని కోసం జీపు పంపించేవాడని అతని భార్య బంధువులంటారు.

వీళ్లు ఎప్పుడో ప్రాణం మీదికి తెచ్చుకుంటారని భయపడిన బాబు భార్య సోమేశ్వరమ్మ, వెంకటరమణ భార్య మద్దమ్మ, వాళ్ల మకాం హైదరాబాదుకు మార్పించారు. బంజారాహిల్స్ ప్రాంతంలో పళ్ల బండ్లు పెట్టుకొని ఆరేళ్లుగా బతుకుతున్నారు. అయితే తమ భర్తలు మధ్యమధ్యలో నందికొట్కూరుకు పోయి వచ్చేవారని ఇద్దరూ అంటారు.

వాళ్లిద్దరినీ, వాళ్లతో బాటు వెంకటేశ్వర్లునూ పోలీసులు హైదరాబాద్‌లోనే అరెస్టు చేశారు. తీసుకొచ్చి కర్నూలు జైలులో పెట్టారు. రెండు నెలలు జైలులో ఉన్న తరువాత ఒక రోజు అలంపురం మేజిస్ట్రేటు కోర్టుకని చెప్పి తీసుకుపోయి కర్నూలు బయటే మామిడాలపాడు దగ్గర కాల్చి చంపారు. చంపిన తరువాత, 'వీళ్ల వల్ల బైరెడ్డి రాజశేఖరరెడ్డి ప్రాణానికి ముప్పు ఉండిందని మా పరిశోధనలో తేలింది' అని ఎస్పి సీతారామాంజనేయులు ప్రకటించారు. జైలులో సురక్షితంగా ఉన్నవారి వల్ల ఎవరికైనా ప్రమాదం ఏ విధంగా ఉంటుందన్న ప్రశ్న పక్కనబెడితే వాళ్లు బైరెడ్డి వర్గం నుండి వైదొలగే క్రమంలో ఉన్నారా? అందువల్లనే ఇప్పుడే- ఇంకా వేరే ఏ వర్గంలోకీ పోకుండా సంధి దశలో ఉండగానే - చంపేస్తే ఏ గొడవా లేకుండా తన పనయిపోతుందని ఎస్పి భావించారా? అన్న సందేహం వస్తుంది. వాళ్లను చంపడం అన్యాయమని బైరెడ్డీ అనలేదు, అతని ప్రత్యర్థి గౌర వెంకటరెడ్డీ అనలేదని గమనార్హం.

ఈ వరుసలో చనిపోయిన వారిలో ఒకే ఒకడు దళితేతరుడు. అతను బనగానపల్లి మండలం వెంకటాపురం వాస్తవ్యుడు. బాసిరెడ్డి అశ్వత్థరెడ్డి. తొలినాడు వీళ్ల కుటుంబానిది అవుకు మండలం కాశీపురం. అవుకు ముఠారాజకీయాలలో చల్లా రామకృష్ణారెడ్డి ప్రత్యర్థి అయిన ఫకీర్‌రెడ్డి అనుచరుడిగా ఉండేవాడు అశ్వత్థరెడ్డి. ఒకసారి ఫకీర్‌రెడ్డిని చావు నుండి కాపాడాడని అంటారు. అయితే అతనికి ఫకీర్‌రెడ్డితో తేడాలు వచ్చాయి. కొన్నాళ్లు తాడిపత్రిలో ఉన్నాడు. కాటసాని రాంభూపాలరెడ్డి బంధువర్గానికి చెందిన రామిరెడ్డితో కలిసి ఆ గుంపు నేర జీవితంలో కొన్నాళ్లు భాగం అయ్యాడు. అయితే ఒక దోపిడీ కేసును వాళ్లు అతని మీదికి నెట్టి తమ మీద కేసు లేకుండా చేసుకునేసరికి వారికి దూరం అయ్యాడు.

ఫకీర్‌రెడ్డికి మాత్రం అశ్వత్థరెడ్డి పైన సందేహం పోలేదు. అతను తెలుగుదేశం నాయకుడు. ఎప్పటికైనా తన ప్రత్యర్థులైన కాంగ్రెస్ వాదులతో అశ్వత్థరెడ్డి చేతులు కలిపి తనను చంపుతారని అనుమానించసాగాడు. ఆ సందేహంతో అతనే తనను చంపుతాడన్న భయం అశ్వత్థరెడ్డికి పట్టుకుంది. తనను కాపాడే వారెవ్వరూ లేరని గ్రహించి ప్రకాశం జిల్లా కనిగిరికి పోయి స్థిరపడ్డాడు. ప్రమీల అనే ఎరుకల కులానికి చెందిన స్త్రీని మారుమనువు చేసుకున్నాడు ( ఈ రకంగా హతులలోని ఒక్క రెడ్డి కూడా రెడ్డి కాకుండా పోయాడు). నాలుగు సంవత్సరాలుగా అక్కడ ఉన్నాడు. అక్కడ అతనిపైన ఒక్క కేసు కూడా ఈ నాలుగేళ్లలో లేదు.

జూలై 22 రాత్రి అవుకు పోలీసులు కనిగిరికి పోయి ప్రమీల సమక్షంలోనే అశ్వత్థరెడ్డిని పట్టుకున్నారు. నేరుగా వెనక్కి తీసుకొచ్చి బేతంచర్ల సమీపంలోని సిమెంట్‌నగర్ దగ్గర కాల్చి చంపారు. ఒకనాడు ఫకీర్‌రెడ్డి మనిషిగా ఉన్న అశ్వత్థరెడ్డి అతనికి దూరమయినాడుగానీ రామకృష్ణారెడ్డి వర్గంలో చేరలేదు. రాంభూపాలరెడ్డి గుంపుతో తాత్కాలికంగా మాత్రమే తిరిగాడు తప్ప అందులో పూర్తిగా భాగం కాలేదు. అటువంటి వాడిని చంపితే ఎవరూ అడగరన్నది పోలీసుల ధీమా. అయితే ఈ 'వ్యూహం' ఫలితంగా వాళ్లు నేరప్రపంచానికి చెందిన వారికి ఇస్తున్న సందేశం ఏమిటంటే, ఏదో ఒక వర్గంలో (అందులోనూ తెలుగుదేశానికి చెందిన నాయకుడి వర్గంలో) చేరితే తప్ప ప్రాణాలు దక్కవని. ఏదో ఒక వర్గంలో చేరి ఒక నాయకుడి అండ వెతుక్కొని బతికిపొమ్మని.

మామూలుగానయితే అశ్వత్థరెడ్డిని హతమార్చే పని ఫకీర్‌రెడ్డిది అయి వుండేది. అయితే అతనికది సులభం కాదు. ఇంటికిపోయి పిలుచుకొచ్చి చంపిపడేయలేడు. పోలీసులు చట్టాన్ని అడ్డం పెట్టుకొని ఎవరినైనా కస్టడీలోకి తీసుకోగలరు కాబట్టి వారికి ఆ పని సులభం. ఫకీర్‌రెడ్డి కోసమే చేసిపెట్టారో లేక ఎస్పీగారి 'వ్యూహాని'కి అశ్వత్థరెడ్డి తగిన బలిపశువని గ్రహించి చేశారో తెలీదు.

## వలసపోయిన వాణ్ని పట్టుకొచ్చి చంపారు

మనుషుల గురించి వివరాలు పల్లెలలో తెలిసినంత సులభంగా పట్టణాలలో తెలియవంటారు. ఈ వరస హత్యలలో చనిపోయిన వారిలో కల్లూరి (బలిజ) వెంకటేశ్వర్లు ఒక్కడే పట్టణవాసి. అతనిది నంద్యాల. అయితే అతని గతాన్ని గురించి ఎక్కువ వివరాలు తెలుసుకోవడం కష్టంగా ఉంది. అతనిని 'మర్డర్ల వెంకటేశ్వర్లు' అంటారని నంద్యాలలో చాలామంది చెప్పారు. కానీ ఆ పేరు ఎందుకు వచ్చిందో ఎవరూ చెప్పలేకుండా ఉన్నారు. ఒక కేసులో శిక్షపడి ఏడు సంవత్సరాలు జైలులో ఉండి వచ్చిన మాట వాస్తవం. ఆ తరువాత ఇక్కడ ఉండడం మంచిది కాదని అతని భార్య లక్ష్మీదేవి రంగారెడ్డి జిల్లా తాండూరుకు సంసారాన్ని తరలించింది. ఒక స్టోన్ పాలిషింగ్ యూనిట్లో పని సంపాదించుకుని బతకసాగారు.

ఒక సంవత్సరం కింద పోలీసులు అతనిని తాండూరులో పట్టుకొని నంద్యాలకు తీసుకొచ్చారు. కొన్నాళ్లు జైలులో ఉండి బయటికొచ్చి నంద్యాలలోనే ఉండి కోర్టుకు హాజరవుతూ ఉన్నాడు. అతని మీద ఒక్క కేసే ఉంది. మొన్నటి వినాయక చవితినాడు పోలీసులతనిని జీపులో కిడ్నాప్ చేసి తీసుకుపోయే ప్రయత్నం చేయగా అతని భార్య అల్లరి చేసి ఇరుగుపొరుగును పోగు చేసి అడ్డం పడింది.

అక్టోబర్ నెల మూడవవారంలో గురవయ్య అనే స్పెషల్‌బ్రాంచ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఇంటికొచ్చి అదీ ఇదీ మాట్లాడి 'ఇప్పుడింకేం భయం లేదు' అని హామీ యిచ్చి అతని అడ్వకేట్ వాసు (శ్రీనివాసులు) ఇంటికొకసారి అతన్ని రమ్మని చెప్పాడు. 22వ తేదీన వెంకటేశ్వర్లు చెప్పిన ప్రకారం అడ్వకేట్ ఇంటికని బయలుదేరాడు. వెంకటేశ్వర్లు ఇంటిబయట ఆటో ఎక్కబోగా ముగ్గురు లేక

నలుగురు పోలీసులు అతన్ని ఆటో నుండి బయటకు లాగారు. పక్కనే ఆంజనేయస్వామి గుడి దగ్గర ఉన్న జీపులోకి బలవంతంగా ఎక్కించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన అడ్వకేట్ వాసును కూడా జీపులోకి బలవంతంగా ఎక్కించారు. ఆ తరువాత కొద్ది సేపటికే క్రైస్తవుల స్మశానం దగ్గర వెంకటేశ్వర్లును కాల్చిచంపారు.

## 'పెద్దాయన' మనుషుల దగ్గర మాత్రం బెడిసి కొట్టింది

ఇప్పటిదాకా ఈ హత్యలన్నీ సజావుగానే సాగాయి. అయితే మితిమీరిన ఆత్మవిశ్వాసంతో కాబోలు ఎస్పి సీతారామాంజనేయులుగారు అప్పటిదాకా పాటించిన వ్యూహాన్ని తానే అతిక్రమించారు. కోట్ల విజయభాస్కరరెడ్డికి చాలా సన్నిహితులయిన కిష్టన్న, రాముడులను డిసెంబర్ 4న పోలీసులు కర్నూలు పట్టణంలోని మౌర్య హోటల్ దగ్గర పట్టుకొని కొద్ది సేపటిలోనే బళ్లారి చౌరస్తా దగ్గర కాల్చి చంపారు. కోట్ల విజయభాస్కరరెడ్డికి కిష్టన్న చాలా 'కావలసినవాడు'. ఆయనగారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో పదవులు వెలగబెట్టినప్పుడు సహితం కిష్టన్న వారి అధికార నివాసంలో పోలీసుల నుండి తలదాచుకున్న ఉదంతాలున్నాయి. ఇది కర్నూలు జిల్లాలో బహిరంగ రహస్యం. పట్టుకొని హతమార్చి ఎఫ్ఐఆర్లో 'ఎరుకల కిష్టిగాడు' అని రాసిన కర్నూలు పోలీసులకు విజయభాస్కరరెడ్డికీ అతనికీ ఉన్న సంబంధాన్ని గురించి బహిరంగంగా మాట్లాడే ధైర్యం ఉంటే వాళ్లు చేసిన తప్పుడు పనిలో కనీసం నిజాయితీ ఉందనయినా ఒప్పుకోవచ్చు. కానీ ఇంతమంది 'కిరాయి హంతకులను' చంపిన ఎస్పి సీతారామాంజనేయులు వారిని 'కిరాయికి' తీసుకున్నదెవరు అన్న ప్రశ్న మాత్రం ఒక్కరోజూ వేసుకోలేదు.

కిష్టన్నకు ఒక హత్యకేసులో జీవితఖైదు శిక్షపడింది. హైకోర్టులో అది 5 సంవత్సరాలకు తగ్గించబడింది. సుప్రీంకోర్టు రెండవ అప్పీలు స్వీకరించి అతనికి బెయిలు ఇచ్చింది. (కోడుమూరుకు చెందిన 'ఎరుకల కిష్టిగాడి'కి సుప్రీంకోర్టు దాకా పోయే స్తోమత పెద్దాయన అని పిలవబడే కోట్ల విజయభాస్కరరెడ్డి ఇయ్యకపోతే లభించేది కాదని వేరే చెప్పనవసరం లేదు. వీరి కోసం వారు హత్యలు చేస్తారు. వీరు వారి డబ్బు దస్కమే కాకుండా న్యాయసహాయం కూడా అందిస్తారు. అయితే డిసెంబర 4న మాత్రం న్యాయసహాయం అందే వ్యవధి లేకుండానే కిష్టన్నను పోలీసులు చంపేశారు).

కోడుమూరుకు తిరిగి వచ్చిన కిష్టన్నను పోలీసులు బెదిరించసాగారు. అతని సహచరుడు రాముడును కూడా బెదిరించారు. ఇక్కడుంటే చంపుతామన్నారు. డిసెంబర్ 3న ఇద్దరూ కాంగ్రెస్ నాయకుల సహాయం కోసం కర్నూలుకు పోయారు. కోడుమూరు ఎంఎల్ఏ శిఖామణి, ఆలూరు ఎంఎల్ఏ మారప్పలను కలిశారు. తాము ముఖ్యమంత్రితో మాట్లాడ్తామనీ అంతవరకు కర్నూలులోనే విజయభాస్కరరెడ్డి కొడుకు జయసూర్యప్రకాశరెడ్డి ఇంట్లో ఉండమనీ ఆ నాయకులు వారికి సలహా ఇచ్చారు.

అక్కడ ఉంటూ కిష్టన్న, రాముడు ఏవో వస్తువులు కొనుక్కోవడానికి 4వ తేదీ పొద్దున్న బయటికి పోయారు. 9.30 ప్రాంతంలో మౌర్యహోటల్ దగ్గర పోలీసులు వారిని పట్టుకున్నారు. బలవంతంగా జీపులో ఎక్కించుకున్నారు. ఆ సంగతి తెలిసి కాంగ్రెస్ ఎంఎల్ఏలు రాష్ట్రహైకోర్టుకూ జాతీయ మానవహక్కుల కమిషన్కూ ముఖ్యమంత్రికీ డిజిపికీ టెలిగ్రాంలు వెంటనే ఇచ్చారు. విజయభాస్కరరెడ్డికి ఫోన్ మీద చెప్పారు. ఆయన వెంటనే రాష్ట్ర పోలీస్ అధికారులతో ఫోన్ మీద మాట్లాడారు.

కానీ అంతలోనే పోలీసులు వారిద్దరినీ కాల్చి చంపారు.

అప్పటికి ఏడు నెలలుగా జిల్లాలో పోలీసులుగా సాగిస్తున్న హత్యాకాండను ఉదాసీనంగా చూస్తున్న మధ్యతరగతి మొదటిసారిగా స్పందించింది. జిల్లాలో విజయభాస్కరరెడ్డి 'పెద్దరికం' అటువంటిది మరి.

ఎందుకయితేనేం, కర్నూలులోని బుద్ధిజీవులు, రాజకీయజీవులు (అధికారపార్టీకి చెందినవారిని మినహాయించి) అంతా స్పందించారు. హైకోర్టులో కేసులు కూడా పడ్డాయి. ఆ కారణంగా కాబోలు సీతారామాంజనేయులు వారి దుష్టసంహారం డిసెంబర్ 4 దగ్గర ఆగిపోయింది. అక్కడే ఆపడానికి ఈ మాత్రం గొడవ చాలకపోవచ్చు. చనిపోయిన వాళ్లు ఈ రెడ్డి మనుషులా ఆ రెడ్డి మనుషులా అని చూడడం మానేసి సూత్రబద్ధంగా స్పందించడం సమాజం నేర్చుకున్న రోజు మాత్రమే అది శాశ్వతంగా ఆగగలదు.

●